# తీవ్ర హెచ్చుతగ్గులు ఉండొచ్చు

**గత వారం:** అంత క్రితం రెండు వారాలుగా క్షీణతను చూసిన సెన్సెక్స్ గత వారంలోనూ ఊగిసలాటను కనబరచినప్పటికీ చివరకు 41 పాయింట్ల లాభంతో ముగిసింది. సోమవారం కోల్ ఇండియా ఐపీఓ ప్రారంభం కావడంతో మదుపరులు వారి నిధులను మళ్లించడం కోసం కొన్ని రోజుల పాటు మార్కెట్లలో లాభాల స్వీకరణకు మొగ్గు చూపారు. ఆ తరువాత చైనా ప్రభుత్వం ఒక్కసారిగా వడ్డీ రేట్లను పెంచిన దరిమిలా ఇక్కడి మార్కెట్లలో అమ్మకాల ఒత్తిడి తలెత్తింది. బుధవారం సెన్సెక్స్ 19823కు జారింది. ఇది వారంలోనే కనిష్ఠ స్థాయి. గురువారం సూచీలోని దిగ్గజ కంపెనీలు రెండో త్రైమాసిక ఫలితాలను ఆశించిన దానికన్నా మెరుగ్గా ప్రకటించడంతోనూ, కోల్ ఇండియా ఐపీఓకు చక్కటి స్పందన వ్యక్తం కావడంతోనూ, ఆహార ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టడంతోనూ కొనుగోళ్ల సందడి కనిపించింది. అయితే మళ్లీ శుక్రవారం మాత్రం గ్రూప్ ఆఫ్ ట్వంటీ ఆర్థిక మంత్రుల సమావేశం దక్షిణ కొరియాలో ప్రారంభం అవుతున్న విషయాన్ని దృష్టిలో పెట్టుకొని మదుపరులు అప్రమత్తమై మరో దఫా లాభాల స్వీకరణకు పాల్పడ్డారు.

విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్ఐఐలు) గత వారంలో రూ.3,598 కోట్ల విలువైన షేర్లను నికరంగా కొనుగోలు చేశాయి. మ్యూచువల్ ఫండ్‌లు రూ.1,766 కోట్ల షేర్లను విక్రయించాయి.

**రంగాల వారీగా:** ఔషధ తయారీ రంగంలో ప్రధాన కంపెనీలకు యూఎస్ఎఫ్‌డీఏ అనుమతులు దక్కడంతో ఆరోగ్య సంరక్షణ రంగ షేర్లలో కొనుగోళ్లు సాగాయి. రిఫైనరీ మార్జిన్‌లు మెరుగుపడవచ్చన్న అంచనాల మధ్య చమురు మార్కెటింగ్ కంపెనీల షేర్లపై ఆసక్తి వ్యక్తమై, చమురు- గ్యాస్ సూచీ వారాంతానికల్లా లాభాల బాటలో పయనించింది. యంత్ర పరికరాల కంపెనీల ఫలితాలు బాగుండటంతో ఆ విభాగం షేర్లు దూసుకువెళ్లాయి. లోహాల సూచీకి భారీ నష్టాలు ఎదురయ్యాయి. మన్నికైన వినియోగ వస్తు షేర్లలో లాభాల స్వీకరణ నమోదు అయింది.

లాభ నష్టాల నిష్పత్తి 4:5గా ఉండి, మార్కెట్ లాభాల స్వీకరణకు లోనయినట్లు సూచించింది.

**ఈ వారం:** రెండు వారాలు నష్టపోయిన మార్కెట్ గత వారం కనీస లాభాలను అందుకొని, కీలక స్థాయి అయిన 19863కు ఎగువన స్థిరపడింది. ఈ స్థాయికి దిగువన నిర్ణయాత్మకంగా ముగిసిందంటే స్వల్ప కాలానికి సెన్సెక్స్ మరింతగా దిద్దుబాటు (కరెక్షన్)కు గురి కావచ్చన్న సంకేతాన్ని అందిస్తున్నట్లు భావించాలి. అలా కాక సెన్సెక్స్ 20461కి ఎగువన ముగిస్తే గనక అది ఊర్ధ్వముఖ ర్యాలీ దిశగా వెళ్తుందని అర్థం. మార్కెట్‌కు దిగువ స్థాయిల వద్ద కూడా ఎఫ్ఐఐల నిధులు తరలివచ్చాయి. ఒక్క అక్టోబరు నెలలోనే రికార్డు స్థాయిలో రూ.25,807 కోట్లు అందాయి. ఎఫ్ఐఐల కార్యకలాపాలను మార్కెట్ నిశితంగా గమనిస్తుంది. తేడా ఉంటే మార్కెట్ జోరుకు అడ్డుకట్ట పడవచ్చు.

**మార్కెట్‌ను ప్రభావితం చేసే అంశాలు:** నెలవారీ డెరివేటివ్‌ల గడువు గురువారం ముగుస్తుంది. ప్రస్తుతం వెల్లడి అవుతున్న కంపెనీల త్రైమాసిక ఫలితాల తీరు ఆధారంగా ఎంపిక చేసిన కొన్ని కౌంటర్లలో కదలికలు ఉంటాయి. ద్రవ్యోల్బణం మరింత దిగివస్తే మార్కెట్ సానుకూలంగా ప్రతిస్పందించవచ్చు. కరెన్సీ అంశంలో జి-20 సమావేశం తీసుకొనే నిర్ణయం మార్కెట్‌కు దిశానిర్దేశం చేయవచ్చు. అమెరికా నుంచి అందే సంకేతాలు వాటి వంతు పాత్రను పోషించవచ్చు.




**తక్షణ నిరోధ స్థాయిలు:** 20274, 20461, 20703; **తక్షణ మద్దతు స్థాయిలు:** 19923, 19772, 19445.

**స్వల్ప కాలంలో మార్కెట్ తీవ్ర హెచ్చుతగ్గులకు లోను కావచ్చని అంచనాలు ఉన్నాయి.**

*– సతీశ్ కంతేటి, జెన్ సెక్యూరిటీస్*